సాక్షి
జగిత్యాల
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



వీరహన్మాన్ శోభాయాత్ర

మెట్‌పల్లి : వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యం లో సోమవారం పట్టణంలో వీర హన్మాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.



భాగవత గ్రంథ పఠనం

కోరుట్లరూరల్: డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రీ ఆధ్వర్యంలో వాసవీ కల్యాణ భవన్‌లో భాగవత గ్రంథ పఠనం చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండ తీవ్రంగా ఉంటుంది.

నిరాశావాది తనకు వచ్చిన అవకాశంలో కష్టాన్ని చూస్తే.. ఆశావాది కష్టంలో అవకాశం కోసం వెతుకుతాడు.
- మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6.33	బుధ 4.42

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరణ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న జనార్దన్‌రెడ్డి

జగిత్యాలక్రైం: ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ అదనపు ఎస్పీగా ఆర్.జనార్దన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

దైవజ్ఞకు జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న హరీశ్ దైవజ్ఞ

కోరుట్లరూరల్: పట్టణానికి చెందిన వాస్తు, జోతిష్య పండితుడు పసుల హరీశ్ దైవజ్ఞ- 2023 ఉగాది మహానంది జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు.వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ ఆదివారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో ఈ పురస్కారం అందజేశారు. నూతన భావత్రయ పద్ధతిలో కచ్చితమైన జాతక ఫలిత విశ్లేషణకు పురస్కారం అందించినట్లు సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. హరీశ్ దైవజ్ఞను పలువురు అభినందించారు.

నిబంధనల మేరకు కొనుగోలు

వెల్గటూర్(ధర్మపురి): నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. పైడిపెల్లిలో సోమవారం యాసంగి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల్లో అధికంగా తూకం వేయకూడదని, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాక మూడు రోజుల్లోగా ధాన్యం సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని ఆదేశించారు. ప్రతీ అధికారి క్షేత్రస్థాయిలో కొనుగోళ్ల తీరు పర్యవేక్షించాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. రైస్‌మిల్లర్లు తప్పతాలు పేరిట కోతలు విధిస్తే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్

జగిత్యాలటౌన్: సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలపై 40దరఖాస్తులను అధికారులకు సమర్పించారు. ఫిర్యాదులను స్వీకరించిన అదనపు కలెక్టర్ మకరంద్.. మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

షాపులు కేటాయించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాల: వీధి వ్యాపారులకు ఓల్డ్ బస్టాండ్‌లో నిర్మించిన షెడ్లను వెంటనే కేటాయించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదేశించారు. 'వీధిపాలు చేశారు' శీర్షికన గతనెల 25న 'సాక్షి'లో వీధి వ్యాపారుల ఇబ్బందులపై కథనం ప్రచురితమైంది. దీనికి ఎమ్మెల్యే స్పందించారు. సోమవారం ఓల్డ్ హైస్కూల్‌ను ఆనుకుని ఉన్న గోడ తొలగించి వెంటనే వ్యాపారులకు షెడ్లు కేటా యించాలని ఆదేశించారు. గదులు వెంటనే కేటాయిస్తామని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంట డీఈ రాజేశ్వర్ ఉన్నారు.



పోలీసు పోస్టింగుల కాలం!

ప్రతిభావంతులకు పట్టంగట్టే పనిలో ప్రభుత్వం

- నేతల లేఖల కోసం ఖాకీల ప్రదక్షిణలు
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న పైరవీలు
- ఏసీపీ నుంచి ఎస్సైల దాకా బదిలీకి యత్నం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పోలీసుల బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మరో ఐదారు నెలల్లో రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సమరం జరగబోతున్న నేపథ్యంలో ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు పూర్తిచేసింది. ఇక తరువాత స్థాయిలో ఉన్న ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్‌– ఇన్‌స్పెక్టర్ల స్థాయి అధికారుల బదిలీలపై కొంతకాలంగా హోంశాఖ కసరత్తు చేస్తోంది. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్ కమిషనరేట్, రామగుండం కమిషనరేట్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలో కిందిస్థాయిలో ఎస్సైల బదిలీలు ఇప్పటికే మొదలయ్యాయి. ఇక కీలకమైన సీఐ, ఏసీపీల బదిలీల విషయంలో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎవరిని ఎక్కడ నియమించాలన్న విషయంలో ఇటు ఉన్నతాధికారులు, అటు హోంశాఖ పకడ్బందీగా ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం అధికారుల ట్రాక్ రికార్డుతోపాటు, సమర్థతపై ఫోకస్ పెట్టినట్లు సమాచారం.

మూడేళ్ల నిబంధన కీలకం..!

క్రితంసారి జరిగినట్లుగా ఈసారి అసెంబ్లీ ఎన్నికలు వన్‌సైడ్‌గా జరిగే అవకాశాలు చాలా తక్కువ. అధికార పార్టీకి ప్రతిపక్ష పార్టీల నుంచి మునుపటి కంటే పోటీ అధికంగా ఉండే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఎన్నికలలో సున్నితమైన, కీలకమైన నియోజకవర్గాల్లో ప్రతిభావంతులైన అధికారులకు పోస్టింగులు ఇవ్వాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ నియామకాన్ని రద్దు చేస్తూ.. కేంద్రం ఆయన్ని ఏపీ కేటాయించింది. దీంతో ప్రభుత్వం డీజీపీ విషయంలోనూ ఆచితూచి వ్యవహరించి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలే అప్పగించింది. ప్రస్తుతం కేంద్రం-రాష్ట్రం మధ్య పరస్పర రాజకీయ ఆధితప్య పోరు తీవ్రమైన నేపథ్యంలో పోస్టింగుల విషయంలో ఎక్కడా సాంకేతిక పరమైన లోపాలు, పొరబాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. అందుకే.. ఇటీవల జరిగిన ఐఏఎస్, ఐపీఎస్‌ల విషయంలోనూ జాగరుకతతో వ్యవహరించింది.

ఇందులో భాగంగానే.. కరీంనగర్ సీపీగా సుబ్బారాయుడు, రామగుండం సీపీగా రెమా రాజేశ్వరి, సిరిసిల్ల ఎస్పీగా అఖిల్‌మహాజన్, జగిత్యాల ఎస్పీగా భాస్కర్‌లను నియమించి మొత్తం ఉమ్మడి జిల్లా పోలీసు బాసులను ఏకకాలంలో మార్చింది. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం.. గత ఎన్నికల సమయంలో పనిచేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు లేదా మూడేళ్లకు మించి ఒకే కుర్చీలో విధులు నిర్వహిస్తోన్న పోలీసులకు స్థానచలనం తప్పేలా లేదు. ఈ విషయంలో ఇప్పటికే కొన్నిస్థానాల్లో ఎస్సై ర్యాంకు ఆఫీసర్లను ఉన్నతాధికారులు మార్చారు కూడా.

లేఖల కోసం ఏసీపీలు, సీఐల పైరవీలు..!

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం డీఎస్పీల జాబితాను ఇప్పటికే తెప్పించుకుంది. అదే సమయంలో కరీంనగర్, రామగుండం కమిషనరేట్లతోపాటు సిరిసిల్ల, జగిత్యాల పోస్టింగుల కోసం పలువురు డీఎస్పీలు ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా చాలాకాలంగా పోస్టింగులు లేకుండా లూప్‌లైన్లలో ఉంటున్న అధికారులు తమకు తెలిసిన నాయకుల ద్వారా ఈసారి ఎలాగైనా పోస్టింగ్ దక్కించుకోవాలని నేతల లేఖలు సంపాదించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు సైతం తాము పనిచేసే నియోజకవర్గం, జిల్లాను కుదిరితే జోన్ సైతం మారేందుకు వెనకాడటం లేదు. తమకు తెలిసిన నాయకుడు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా సరే.. వెళ్లి వెంటనే చేరిపోతున్నారు. ఇదే రకంగా ఇప్పటికే పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు జోన్లు మారి మరీ విధుల్లో జాయినయ్యారు.

కరీంనగర్‌లో విచిత్రం..!

కరీంనగర్ కమిషనరేట్ విషయానికి వస్తే.. ఇక్కడ పోలీసుల తీరు విచిత్రంగా ఉంటుంది. ఇక్కడే ఎస్సైలుగా సర్వీసులో చేరిన కొందరు ఇప్పటికీ ఏసీపీలుగా కొనసాగుతున్నారు. వీరికి బదిలీ గండం వెంటాడుతుండటంతో లూప్‌లైన్‌లోకి వెళ్లాలా? లేక అలవాటు ప్రకారం.. ఐదారు నెలలు మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లి.. సరిగ్గా ఎన్నికల ముందు తిరిగి రావాలా? అన్న ఆలోచనలో ఉన్నారు. మొత్తానికి కరీంనగర్‌ను వదిలేందుకు వీరంతా ససేమీరా అంటున్నారు. అందుకే.. ఏ చిన్న అవకాశం దొరికినా.. దాన్ని సద్వినియోగ పరచుకుని ఇక్కడే రిటైర్ అవ్వాలని కంకణం కట్టుకున్నారు.

అమ్మో..! ఆ నియోజకవర్గమా?

ఉమ్మడి జిల్లాలో మూడు జిల్లాల్లో విస్తరించిన ఓ నియోజకవర్గం పేరు చెబితేనే.. పోలీసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించాలంటే సిఫారసు లేఖలు తప్పనిసరి. వాటితో విధుల్లో చేరిన పోలీసులను ఇప్పటికీ సిఫారసు లేఖలు ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఆ నియోజకవర్గంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు 10 నెలలు డ్యూటీ చేసిన అనంతరం మరో అధికారికి ఆ స్థానంలో లేఖలు ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయంలో ఇప్పటికే పలువురు ఎస్సైలు, సీఐలు చేతులు కాల్చుకున్నారు. తాజాగా కూడా ఈ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని సమాచారం. ఇటీవల కూడా జరిగిన బదిలీల్లోనూ ఇలాగే తమకు అన్యాయం జరిగిందని కొందరు, జరగనుందని మరికొందరు పోలీసులు బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఇంటలిజెన్స్ విభాగం ఇప్పటికే సీఎం కార్యాలయానికి సైతం చేరవేసిందని సమాచారం. అందుకే.. ఆ నియోజకవర్గం పేరు చెబితేనే.. పోలీసులు బెంబేలెత్తిపోతున్నారు.

హన్మాన్ జయంతికి ఏర్పాట్లు



కోనేరులో నీరు పరిశీలిస్తున్న ఏఈవో శ్రీనివాస్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు హన్మాన్ చిన్న జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ అధికారులు సౌకర్యాల కల్పనలో నిమగ్నమయ్యారు. సీఎం కేసీఆర్ ఆలయ అభివృద్ధికి రూ.100కోట్లు కేటాయించాక తొలిసారి చేపట్టిన ఉత్సవాలు ఇవే కావడంతో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. మనరాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి లక్షల మంది భక్తులు, దీక్షాపరులు తరలివచ్చే అవకాశం ఉంది. దీక్ష విరమణ, మాల విరమణ ఇక్కడ చేసుకుంటారు. వారికి అవసరమైన సౌకర్యాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా కోనేరులో నీరు నిల్వ చేసేందుకు పూనుకున్నారు. ఆలయ పరిసరాల్లో ఎండ వేడి నుంచి భక్తులకు రక్షణ కోసం అడుగడుగునా చలువపందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే తాగునీటి పైపులైన్లు నిర్మించారు. స్వామివారి దర్శనం కోసం రద్దీని తట్టుకునేలా ఆలయ పరిసరాల్లో క్యూలైన్లు సిద్ధం చేశారు.

జేఎన్టీయూ వద్ద స్వాగత తోరణాలు..

దొంగలమర్రి, కొండగట్టు దిగువన, జేఎన్టీయూ ప్రాంతాల్లో ప్రత్యేక స్వాగత తోరణాలు సిద్ధం చేశారు. ఘాట్‌రోడ్డు కింద నుంచి జేఎన్టీయూ మీదుగా రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కొండగట్టు కిందనుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మాల విరమణకు అర్చకుల నియామకం

లక్షలాదిగా తరలివచ్చే భక్తులు.. దీక్షాపరులు మాల విరమణ చేసేందుకు వీలుగా కొండపై అదనంగా అర్చకులను అధికారులు నియమించారు. దాదాపు మూడు లక్షల ప్రసాదాలు సిద్ధం చేశారు. ఇందుకోసం ఏడు 7కౌంటర్లు ఏర్పాటు చేశారు. వరుస దొంగతనాల నేపథ్యంలో నాలుగు బాడీ స్కానర్లు, మెటల్ డిటెక్టర్లు బిగించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ది శ్రీనివాస్ తెలిపారు.

ఎవరికి లాభం.. ఏమిటి నష్టం?

- ఇథనాల్ పరిశ్రమకు నిరసన సెగ
- నాలుగు రోజులుగా కొనసాగుతున్న రైతుల ఆందోళన
- యువతకు ఉపాధి అవకాశాలు
- రైతుల పంటలకు పెరగనున్న డిమాండ్
- అధికారులు, ప్రజాప్రతినిధుల వివరణ



కలెక్టరేట్‌కు తరలివస్తున్న వివిధ గ్రామాల ప్రజలు



జాతీయ రహదారిపై బైఠాయించిన గ్రామస్తులు

జగిత్యాల/జగిత్యాలటౌన్/వెల్గటూర్: జిల్లాలోని వెల్గటూర్ మండలం స్తంభంపల్లి- పాశిగామ గ్రామాల మధ్య రూ.750 కోట్ల అంచనా వ్యయంతో స్థాపించే ఇథనాల్ రైస్ బ్రాన్ ఆయిల్ పరిశ్రమకు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. కర్మాగారం ఏర్పాటుతో జల, వాయు, పంటలు కలుషితమవుతాయని, ప్రధానంగా సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నీరు ఎందుకూ పనికిరాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా ఈ రెండు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ రోడ్లెక్కుతున్నారు. సోమవారం ఏకంగా జిల్లా కేంద్రానికి చేరుకుని కలెక్టరేట్ ఎదుట సుమారు 200మంది బైఠాయించి నిరసన తెలిపారు. తమ పనులన్నీ వదిలిపెట్టి ధర్నాలు, రాస్తారోకోలతో నిరసనలు చేపడుతున్నారు. దీంతో గ్రామాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పోలీసు బలగాలు నిత్యం పహారా కాస్తున్నాయి.

200మంది బీఆర్‌ఎస్ శ్రేణుల రాజీనామా..

- పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పాశిగామ బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాలకు చెందిన సుమారు 200 మంది శ్రేణులు తమ పదువులకు ఇప్పటికే రాజీనామా చేశారు.
- పరిశ్రమపై ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకతను తట్టుకోలేని పాశిగామ గ్రామ సర్పంచ్.. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా పంచాయతీలో తీర్మానం చేసి.. ఆ కాపీని గ్రామస్తులకు అందజేశారు.
- మరోవైపు.. తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా, కనీసం గ్రామసభ నిర్వహించకుండా, పరిశ్రమ ఏర్పాటుకు పంచాయతీ పాలకవర్గం ఏకపక్షంగా ఎలా తీర్మనిస్తుందని స్తంభంపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఆదివారం ఏకంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ముట్టడించారు.
- పరిశ్రమ ఏర్పాటుతో సమీప గ్రామాలు ఎడారులుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

క్రిబ్‌కో, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పరిశ్రమ..

- వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామ శివారు సర్వే నంబర్ 1090లో క్రిశాక్ భారతీ కో ఆపరేటివ్ లిమిటెడ్ (క్రిబ్‌కో), రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఇథనాల్ రైస్ బ్రాన్ ఆయిల్ పరిశ్రమ ఏర్పాటుకు నిర్ణయించారు.
- 110 ఎకరాల్లో సుమారు రూ.750 కోట్ల అంచనా వ్యయంతో కర్మాగారం స్థాపనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.
- రోజు దాదాపు 8 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యంతో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారు.
- 2021 డిసెంబర్ 28న క్రిబ్‌కో సంస్థ చైర్మన్ చందర్‌పాల్‌సింగ్ బృందం ప్రాథమికంగా స్థల పరిశీలన చేసింది.
- 2022 నవంబర్ 18న అప్పటి కలెక్టర్ రవి స్థల పరిశీలన తర్వాత పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
- 2023 మార్చి 31న దాదాపు రూ.13 కోట్ల అంచనా వ్యయంతో కర్మాగారానికి కేటాయించిన స్థలం చదును చేయడానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ భూమిపూజ చేశారు.

ఇవి ప్రయోజనాలు..

- ఇథనాల్ రైస్ బ్రాన్ ఆయిల్ పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 3 వేల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి లభిస్తుంది.
- రోజు 650 టన్నుల చొప్పున ఏటా 2.50 లక్షల టన్నుల ధాన్యం, మొక్కజొన్న పంటలను ఇథనాల్ తయారీకి ఉపయోగిస్తారు.
- తద్వారా ఈ ప్రాంతంలో పండే పంటలకు డిమాండ్ ఏర్పడుతుంది. మద్దతు లభిస్తుంది.
- పరిశ్రమ స్థాపన ద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతుంది.
- పరిశ్రమ పరిసరాల్లోని భూముల విలువలు భారీగా పెరుగుతాయి.

ఇవి నష్టాలు..

- పరిశ్రమ సమీపంలోని గాలి, నీరు, వాతావరణం కలుషితమవుతాయి.
- సుమారు మూడు కిలో మీటర్ల మేర భరించలేని దుర్వాసన వెదజల్లుతుంది.
- పశువులు, పక్షులు ఇతర జీవరాసుల మనుగడకు ప్రమాదం పొంచిఉంది
- భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవుతాయి.

అవగాహన కల్పిస్తాం



ఇథనాల్ ఫ్యాక్టరీతో సుమారు మూడు వేల మందికి ఉపాధి లభిస్తుంది. గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతి వచ్చింది. మంత్రి కేటీఆర్ సహకారంతో ధర్మపురి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నాం. దీనిద్వారా ఎలాంటి నష్టం లేదు. జిల్లాస్థాయిలో ప్రజాప్రతినిధులు, ఫ్యాక్టరీ టెక్నికల్ ఆఫీసర్లు, కలెక్టర్, రైతులతో కలిసి దీనిపై అవగాహన కల్పిస్తాం. ఎవరూ ఆందోళన చెందవద్దు. పరిశ్రమ ఏర్పాటు గిట్టని వారు ఈ రాద్ధాంతం చేస్తున్నారు.
– కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర సంక్షేమ మంత్రి

ఊరు నాశనమవుతుంది



ఇథనాల్ ఫ్యాక్టరీ కడితే ముందుగా ఊరు నష్టపోతుంది. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలతో నీరు, గాలి పాడవుతయి. పశువులు, పక్షులు బతకవట. పంట పొలాలు పాడయిపోతయట. అందుకే ఈ ఫ్యాక్టరీ వద్దంటున్నం.
– బరుపటి జనార్దన్, గ్రామస్తుడు, పాశిగామ

ఫ్యాక్టరీ కట్టనివ్వం



మా ఊరుకు పక్కనే ఫ్యాక్టరీ కడుతమంటున్నరు. దాంతో చుట్టూ మూడు ఊళ్లకు ప్రమాదమట. ఎవుసం చేసుకొని బతికెటోళ్లం. ఈ ఫ్యాక్టరీ కడితే పంటలు సక్కగ పండయట. మేం, మా పిల్లలు ఏంచేసుకొని బతకాలె?
– కంటెం నర్సవ్వ, గ్రామస్తుడు, పాశిగామ

గురుకులం నిర్మించాలి



ఇథనాల్ పరిశ్రమ నిర్మించే స్థలం అంతకు ముందు గురుకుల పాఠశాలకు కేటాయించారు. గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలంలో ఇథనాల్ ఫ్యాక్టరీని కట్టనివ్వం. ఫ్యాక్టరీ నిర్మాణాన్ని మా గ్రామస్థులందరం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.
– భూపెల్లి ఆనంద్, గ్రామస్తుడు, స్తంభంపల్లి

'కొప్పుల' వర్సెస్ 'అడ్లూరి'

- ఇద్దరి మధ్య మాటల యుద్ధం



దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్న అడ్లూరి లక్ష్మణ్

జగిత్యాల/ధర్మపురి: జగిత్యాల జిల్లామంత్రి కొప్పుల ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ల నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డబ్బులు వసూలు చేశారని, పార్టీ టికెట్లు అమ్ముకున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ వారం క్రితం ధర్మారంలో తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆ ఆరోపణలు ఖండించారు. తాను ఎలాంటి వాసూళ్లకు పాల్పడలేదని, అవసరమైతే ఏప్రిల్ 3న కోటిలింగా శ్రీకోటేశ్వరస్వామి సాక్షిగా ప్రమాణం చేస్తానని, ధమ్ముంటే మంత్రి కూడా వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. అన్నమాట ప్రకారం అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం కోటిలింగాల శ్రీకోటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. తాను ఎవరివద్దా డబ్బులు తీసుకోలేదని, పార్టీ టికెట్లు అమ్మకోలేదని దైవసాక్షిగా ప్రమాణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన ఆరోపణలు సత్యదూరమన్నారు. అవి ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. మంత్రిగా, విప్‌గా రూ.కోట్లు సంపాదించిన ఘనత మంత్రికే దక్కిందని ఆరోపించారు. మంత్రి న్యాయంగా సంపాదిస్తే.. ఆయన ఎక్కడికి రమ్మంటే తాను అక్కడకు వస్తానని, దైవసాక్షిగా ప్రమాణం చేయాలని లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ధర్మపురి నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్‌పై అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య వార్ కొనసాగుతోంది. కొప్పుల ఈశ్వర్ గెలుపు కరెక్ట్ కాదని లక్ష్మణ్‌కుమార్ కోర్టు మెట్లు కూడా ఎక్కారు. కేసు కోర్టులో ఇంకా కొనసాగుతోంది.

మంత్రి కొప్పుల ఆరోపణలు ఇవీ..

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ఇటీవల బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై మంత్రి తీవ్రస్థాయి ఆరోపణలు చేశారు. గత ఎన్నికల్లో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, నామినేటెడ్ పోస్టుల కోసం అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డబ్బులు వసూలు చేశారని అన్నారు. టికెట్లను అమ్ముకున్నారని మంత్రి తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. అంతేకాదు.. టికెట్లు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని ఆదివారం ధర్మపురిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మరోసారి లక్ష్మణ్‌కుమార్‌పై ఆరోపణలు చేయడం కలకలం రేపింది.

నేను ఏ తప్పూ చేయలేదు : డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి

మంత్రి ఈశ్వర్ చేసిన ఆరోపణలను సానుకూలంగా స్వీకరించిన డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్.. తాను ఏ తప్పూ చేయలేదన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీల టికెట్లు అమ్ముకోలేదని స్పష్టం చేశారు. ఆయన అన్నట్లుగా సోమవారం వెల్గటూరు మండలం కోటిలింగాల శ్రీకోటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో పూజలు చేశారు. తాను టికెట్లు అమ్ముకోలేదని దేవునిపై ప్రమాణం చేశారు. 2004 – 2022 వరకు ఎమ్మెల్యేగా, చీఫ్‌విప్‌గా, మంత్రిగా పదవులు చేపట్టిన కొప్పుల ఈశ్వర్.. అక్రమంగా ఏమీ సంపాదించలేదంటూ కోటిలింగాల శ్రీకోటేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. తాను చేసినట్లే మంత్రి కూడా ప్రమాణం చేస్తారా? లేదా? అనేది వేచిచూడాల్సిందే.

న్యాయవాదులు సహకరిస్తే కేసుల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి నీలిమ

జగిత్యాలజోన్: న్యాయవాదుల సహకారంతోనే కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జగిత్యాల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అభినందన కార్యక్రమం సోమవారం జిల్లా కేంద్రంలో జరిగింది. ప్రధాన న్యాయమూర్తి నీలిమ మాట్లాడుతూ, కోర్టు బెంచ్‌కు న్యాయవాదులు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. జగిత్యాల బార్ అసోసియేషన్‌కు రాష్ట్రంలో మంచిపేరు ఉందన్నారు. ఇప్పటివరకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన ముద్దం ప్రభాకర్, ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారులు టి.గంగాధర ప్రసాద్, ఎస్.సంజీవరెడ్డిని సన్మానించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి వీరయ్య, సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిహారిక, రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్‌లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ముద్దం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేత



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న భారతి భట్

జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి భట్ సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని వసతులు పొలాస వ్యవసాయ కళాశాలలో ఉన్నాయని, అగ్రగామిగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కోరారు. వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ సంపత్, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం



జడ్జిలతో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జగిత్యాల జోన్: జగిత్యాల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు ముదుగంటి జనార్దన్ రెడ్డి, మురళీధర్‌రావు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చీటి రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శిగా అందె మారుతి, ఉపాధ్యక్షుడిగా సిరిపురం మహేంద్రనాథ్, కోశాధికారిగా కటుకం చంద్రమోహన్, మహిళా కార్యదర్శిగా పుప్పాల వనిత, గ్రంథాలయ కార్యదర్శిగా కర్నె హరిదాసు, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా పొట్టవత్తిని సతీశ్ ప్రమాణ స్వీకారం చేశారు. సీనియర్ కార్యవర్గ సభ్యులుగా డబ్బు లక్ష్మారెడ్డి, బెత్తపు లక్ష్మణ్, మారిశెట్టి ప్రతాప్, ముద్దం జయలలిత, కలవ్వకుంట్ల వినోద్‌రావు, జూనియర్ కార్యవర్గ సభ్యులుగా గుడికందుల మహేశ్, అల్లె పురుషోత్తం, శ్రీరాం కరుణాకర్, నీరటి వెంకటేశ్, కొత్తపల్లి గంగారాజం, రాచకొండ విజయ్‌కృష్ణ, రాజేశుని జీవన్, కంచి సురేశ్, బొల్లె రమేశ్, ఎండీ సలీం ప్రమాణ స్వీకారం చేశారు.

రైతులకు చెక్కుల పంపిణీ



అందజేసిన చెక్కులు, పాస్‌బుక్‌లతో రైతులు

ధర్మపురి : జైన సహకార సంఘం అధ్యక్షుడు సొల్లు నరేశ్ ఆధ్వర్యంలో కేడీసీసీ బ్యాంకులో సోమవారం 53 మంది రైతులకు రూ.కోటి ఒక లక్ష విలువగల చెక్కులను పంపిణీ చేశారు. వాటిలో పంట అప్పుల కోసం 60.20 లక్షలు, బావి పైపులైన్ నిర్మాణం కోసం 40.80 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మూల మోహన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు కుక్కల గంగారెడ్డి, కల్లెపు లక్ష్మి, మాధవ రెడ్డి, సర్పంచులు ఎన్నం లక్ష్మారెడ్డి, మొగిలి శేఖర్, సీఈవో బలమూరి రామారావు తదితరులున్నారు.

ఆదాయం అంతంతే..!

- చల్‌గల్ మామిడి మార్కెట్‌కు కోట్లలో వ్యాపారం..
- మార్కెట్ ఫీజు మాత్రం అంతంతే..
- నిబంధనల ప్రకారం వసూలు చేస్తే మరిన్ని సదుపాయాలకు అవకాశం



గతేడాది మార్కెట్‌కు వచ్చిన మామిడికాయలు

జగిత్యాల అగ్రికల్చర్ : జగిత్యాల (చల్‌గల్) మామిడి మార్కెట్‌లో కోట్లలో వ్యాపారం జరుగుతున్నా మార్కెట్ ఫీజు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటోంది. అధికారుల నిర్లక్ష్యంతో వ్యాపారులు ఇష్టారీతినా మార్కెట్ ఫీజు చెల్లిస్తుండటంతో, మార్కెట్‌కు తగిన ఆదాయం రావడం లేదు. మార్కెట్ ఏర్పాటై 17 ఏళ్లు గడుస్తున్నా ఏటా రూ.50–60 లక్షల్లోపే ఆదాయం రావడం పలు అనుమానాలకు తావిస్తోంది.

కోట్లలో వ్యాపారం..

చల్‌గల్ మామిడి మార్కెట్ 23 ఎకరాల్లో 2005లో ఏర్పాటుకాగా కోట్లలో వ్యాపారం జరుగుతుతోంది. మామిడికాయల కొనుగోలుకు 88 మంది కమీషన్ ఏజెంట్లు, 59 మంది అడ్తిదారులు ఉన్నారు. వీరంతా ప్రతి సీజన్‌లో రూ.200 కోట్ల వరకు వ్యాపారం చేస్తుంటారు. సీజన్‌లో ఇక్కడి నుంచి మామిడికాయలను పంజాబ్, హర్యానా, ఢిల్లీ, నాగ్‌పూర్ వంటి ప్రాంతాలకు రోజూ కనీసం 5 నుంచి 10 లారీల్లో తరలిస్తుంటారు. పెద్ద లారీలో 12 నుంచి 15, చిన్న లారీలో 8 నుంచి 10 టన్నుల మామిడికాయలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తారు. గత ఐదారేళ్ల నుంచి సగటున టన్నుకు రూ.30 వేల వరకు ఉంది. పెద్ద లారీలో వెళ్లే 15 టన్నుల మామిడికాయకు, టన్నుకు రూ.30వేల చొప్పున రూ.4.50 లక్షలు అవుతుంది. వ్యాపారులు ఒక శాతం మార్కెట్ ఫీజు చెల్లించాల్సి వస్తుంది. ఒక్కో లారీకి రూ.4500 మార్కెట్ ఫీజు చెల్లించాలి. మామిడికాయ రేటు పెరిగినప్పుడల్లా దాని ప్రకారం ఫీజు వసూలు చేయాలి. కానీ, వ్యాపారులు అధికరేటు చెల్లించి కొనుగోలు చేసినా తక్కువ రేటుకు మామిడికాయలు కొనుగోలు చేశామని చెప్పడం, ఆమేరకు అధికారులు మార్కెట్ ఫీజు వసూలు చేయడంతో మార్కెట్‌కు భారీగా ఆదాయం తగ్గుతుంది.

ఏటా రూ.60 నుంచి 70 లక్షలే..

మార్కెట్‌కు మామిడికాయలు భారీగానే వస్తున్నా మార్కెట్ ఫీజు రూ.60–70 లక్షలు దాటడం లేదు. గతేడాది (2022–23) మార్కెట్ ఫీజు కేవలం రూ.59.48 లక్షలు మాత్రమే వసూలైంది. 2018–19లో రూ.71.89 లక్షలు, 2019–20లో రూ.64.01 లక్షలు, 2020–21లో రూ.69.65 లక్షలు, 2021–22లో రూ.91.70 లక్షల మార్కెట్ ఫీజు మాత్రమే వసూలైంది. జగిత్యాల నుంచే కాకుండా నూతనంగా ఏర్పడిన 10 జిల్లాల నుంచి ఈ మార్కెట్‌కు మామిడికాయలను తీసుకువస్తుంటారు.ఏటా దాదాపు 50–60 వేల మెట్రిక్ టన్నులకు పైగా మామిడికాయలు వస్తుంటాయి.

ప్రారంభ సమయంలో నామమాత్రం

దివంగత వైఎస్ హయాంలో అప్పటి మంత్రి జీవన్ రెడ్డి మామిడి మార్కెట్‌ను ఏర్పాటుకు కృషిచేశారు. కోట్లాది రూపాయల విలువైన వాలంతరీ సంస్థ స్థలాన్ని మార్కెట్‌కు ఇచ్చారు. ఇటీవల సీఎం కేసీఆర్ సైతం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఒత్తిడితో మరో 10 ఎకరాలు ఇచ్చారు. విలువైన స్థలంతో పాటు దాదాపు రూ. 6–7 కోట్లతో వ్యాపారులకు షెడ్లు నిర్మించి ఇచ్చారు. మార్కెట్ ప్రారంభ సమయంలో వ్యాపారులు, రైతులకు మామిడి మార్కెట్‌ను పరిచయం చేసేందుకు, లారీకి రూ.500–1000 చొప్పున కేవలం నామమాత్రపు మార్కెట్ ఫీజు వసూలు చేశారు. అదే అదనుగా తీసుకున్న వ్యాపారులు మార్కెట్ ఫీజు చెల్లించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

మార్కెట్ నిర్వహణకూ కష్టమే..

ఫీజు ఆ మార్కెట్ నిర్వహణకు సరిపోకపోవడంతో పాటు కరెంట్ బిల్లులు సైతం మార్కెట్ నుంచే చెల్లించే పరిస్థితి నెలకొంది. మామిడి మార్కెట్‌ను పర్యవేక్షించే నలుగురైదుగురు సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మామిడి మార్కెట్‌లో షెడ్ల నిర్మాణానికి మేడ్చల్, ములుగు, నర్సంపేట, కథలాపూర్, లక్సెట్టిపేట మార్కెట్ల నుంచి రూ. 5.20 కోట్లు అప్పు తీసుకువచ్చారు. కోట్లలో వ్యాపారం సాగుతున్నా అప్పులు చెల్లించడం కష్టంగా మారింది. నిబంధనల ప్రకారం మార్కెట్ ఫీజులు వసూలు చేస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మార్కెట్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించవచ్చు.

ఇష్టారాజ్యంగా ఫీజు వసూలు



మామిడి మార్కెట్‌లో ఇష్టారాజ్యంగా మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఎంత కాయ కొంటున్నారో ఎంత వసూలు చేస్తున్నారో ఎవరికీ తెలియదు. మార్కెట్ ఫీజు బుక్స్ చివరకు వ్యాపారులకే ఇస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీనిపై అధికారులు చొరవ తీసుకోవాలి.

– బందెల మల్లయ్య, చల్‌గల్, రైతు

రోజూ పర్యవేక్షించేలా చూస్తాం..



గతంలో జరిగిన పొరపాట్లు జరగకుండా, ఈ సారి పకడ్బందీగా మార్కెట్ ఫీజును వసూలు చేస్తాం. మార్కెట్ కమిటీ పర్యవేక్షణలో ఉండేందుకే, ఏ వ్యాపారికి మార్కెట్ బయట క్రయ విక్రయాలు చేసేందుకు అనుమతి ఇవ్వడం లేదు. అధికారులు రోజూ వ్యాపారుల దుకాణాలను పర్యవేక్షించేలా చూస్తాం.

– నక్కల రాధ, మార్కెట్ చైర్‌పర్సన్, జగిత్యాల

దుబాయ్‌లో పాపన్నగౌడ్ వర్ధంతి



వర్ధంతి సభలో గౌడ ప్రతినిధులు

కోరుట్లటౌన్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని దుబాయిలోని కరామ కాలికట్ పారగాన్ వేదికపై ఆదివారం నిర్వహించారు. అయిలాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ దుబాయిలోని గౌడ కులస్తులను ఏకతాటిపైకి తెచ్చేందుకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. సుమారు 100 మందికి పైగా గౌడ ప్రతినిధులు హాజరయ్యారని వివరించారు. పరస్పరం సహకారం చేసుకోవాలని తీర్మానించారు. గౌడ కళాకారులను గుర్తించి, వారికి సన్మానం చేసి, సామూహిక సహపంక్తి భోజనం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు సమ్మెట సంతోష్‌గౌడ్, రాజకొండ శ్రీనివాస్‌గౌడ్, దుర్గి విశ్వంభర్‌గౌడ్, రత్నగిరి వంశీగౌడ్, పెద్ద సత్యంగౌడ్, బాలరాజ్‌గౌడ్, అనిల్‌గౌడ్, గోనె గోపిగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రజనీకాంత్‌గౌడ్, గుర్రం సతీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించాలి

జగిత్యాల: ఇరవై ఏళ్లుగా విదేశాలకు వెళ్లి వచ్చిన ఉపాధ్యాయుడికి తిరిగి పోస్టింగ్ ఇవ్వడం సరికాదని, వెంటనే తొలగించాలని జిల్లా బీఎస్పీ ఇన్‌చార్జి మద్దెల నారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడు ఎలాంటి అనుమతులు లేకుండా ఇరవై ఏళ్లుగా విదేశాలకు వెళ్లి వచ్చిన అతనికి మళ్లీ పోస్టింగ్ ఇచ్చారని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు లింబాద్రి, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి అరెస్టు



యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి భోజనం చేస్తున్న లక్ష్మణ్‌కుమార్

సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ తరలించి సాయంత్రం వదిలిపెట్టారు. జిల్లాలో మంత్రుల పర్యటనతోపాటు వెల్గటూర్ మండలంలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరుతూ పాశిగామ గ్రామస్తులు కలెక్టర్‌కు ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చేందుకు వెళ్తుండగా అరెస్టు చేసి సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లక్ష్మణ్‌కుమార్ మాట్లాడారు. పేద ప్రజలకు అండగా ఉంటానన్నారు. పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. మండలంలోని యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు సంఘీభావం ప్రకటించారు.

ఐక్యవేదిక బహిరంగ సభకు తరలిరండి

- జిల్లా కన్వీనర్ దూడ జీవన్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

బుగ్గారం: మాదిగల ఐక్యవేదిక బహిరంగ సభకు భారీగా తరలిరావాలని తెలంగాణ మాదిగల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ దూడ జీవన్ పిలుపునిచ్చారు. ఈనెల 6న ఎండపల్లి మండలంలో జరిగే బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాన్ని జెడ్పీటీసీ రాజేందర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్నవారికి పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వ స్థలాలను మంజూరు చేయాలని కోరారు. మండల కన్వీనర్ నక్క శంకర్, దళిత నాయకులు చీపెల్లి పోశమల్లు, నక్క గంగారాం, న్యాతరి కల్యాణ్, న్యాతరి రాకేశ్, దూడ శంకర్, దూడ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మనుమరాలి జన్మదిన వేడుకలకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు



చిట్యాల చిన్న నర్సయ్య (ఫైల్)

మల్లాపూర్ : మండలంలోని మొగిలిపేట శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిట్యాల చిన్న నర్సయ్య (52) మృతిచెందగా, భార్య విజయ (48)కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మొగిలిపేటకు చెందిన చిట్యాల చిన్ననర్సయ్య–విజయ దంపతులు ద్విచక్రవాహనంపై రాఘవపేటలో మనుమరాలి జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా మొగిలిపేట–రాఘవపేట దారిలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయారు. చిన్ననర్సయ్య అక్కడికక్కడే మృతిచెందగా, విజయకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. తీవ్రంగా గాయపడిన విజయను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు చిట్యాల వివేక్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి



ధర్మేశ్ మృతదేహం

సారంగాపూర్ : బీర్‌పూర్ మండలం కందెనకుంటకు చెందిన గడ్డం ధర్మేశ్ (18) చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటేశ్, శేఖర్, సంజీవ్, బీర్‌పూర్ శివారు గ్రామం ఆసునూరిగూడెంకు చెందిన గంగాధర్, కమలాకర్ కందెనకుంట శివారులో చేపల పట్టేందుకు ధర్మేశ్‌తో వెళ్లారు. గ్రామ శివారులోని పెద్దవాగులో తవ్విన బావుల్లో చేపలను పట్టేందుకు విద్యుత్తు తీగలను ఏర్పాటు చేశారు. ధర్మేశ్‌ను చేపల కోసం నీటిలోకి దిగగా విద్యుధాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడి తల్లి రామక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్మేశ్‌ను వెంట తీసుకెళ్లిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఏఎస్సై రవీందర్ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ ఉద్యోగి..



రాజయ్య (ఫైల్)

మేడిపెల్లి (వేములవాడ) : కోరుట్ల– జగిత్యాల ప్రధాన రహదారిపై మేడిపెల్లి మండలకేంద్రం శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం నూకపల్లికి బెజ్జంకి రాజయ్య (53) మెట్‌పల్లి మున్సిపాలిటీలో టౌన్ మిషన్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం బైక్‌పై స్వగ్రామం నుంచి మెట్‌పల్లికి విధులకు వెళ్తున్నారు. మండలకేంద్రం శివారులోకి చేరుకోగానే అతివేగంతో వచ్చిన లారీ రాజయ్య బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ షేక్ హైమద్ మద్యం మత్తులో వేగంగా లారీ నడపడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. సునీత ఫిర్యాదు మేరకు ఎస్సై సుధీర్‌రావు కేసు నమోదు చేయగా కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న సల్మాన్‌రాజ్

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో పనిచేసే సల్మాన్ రాజ్ అనే సెక్యూరిటీ గార్డు సోమవారం ఆత్మహత్యా యత్నానికి యత్నించాడు. మార్కెట్‌యార్డులో పనిచేసే ఉద్యోగి నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడని, దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపాడు.

సంక్షేమంలో దేశానికి ఆదర్శం

- రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు

వెల్గటూర్(ధర్మపురి): ప్రజా సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వెల్గటూర్ మండలం పైడిపెల్లి గ్రామంలో సోమవారం మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యటించారు. ఎండపల్లి మండలం అంబరిపేట – వెల్గటూర్ మండలం తాళ్లకొత్తపేట వరకు రూ.12కోట్లు, పైడిపెల్లి – పడకల్ వరకు రూ.1.40 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్లు, రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు వారు శంకుస్థాపన చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన గంగుల మల్లయ్య, గంగుల ప్రభాకర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. మంత్రులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి, కలెక్టర్ యాస్మిన్ బాషా, అడిషనల్ కలెక్టర్ లత, ఎస్పీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

జగిత్యాల రూరల్ : జగిత్యాల అర్బన్ మండలం.. గోపాల్‌రావుపేటకు చెందిన దావ గంగారెడ్డి భార్యతో కలిసి మార్చి 30న ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరికీ గాయాలయ్యాయి. గంగారెడ్డి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం.. పొరండ్ల గ్రామంలో ఊర చెరువు సీసీ కాలువ నిర్మాణాన్ని ఆక్రమించుకొని అక్రమంగా గోడ నిర్మించారని సోమవారం కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఊర చెరువు నుంచి నీరు వెళ్లేందుకు గతంలో చిన్ననీటి పారుదల శాఖ అధికారులు సీసీ కాలువ నిర్మించారు. దీంతో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి భర్త అక్రమంగా సీసీ కాలువపై ప్రహరీ నిర్మించారని, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నిర్మాణ పనులు పూర్తి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించడంతో పాటు దీనికి వత్తాసు పలికిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

టిప్పర్ సీజ్

సారంగాపూర్ : బీర్‌పూర్ మండల కేంద్రం మీదుగా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా తహసీల్దార్ శ్రీలత ఆధ్వర్యంలో పట్టుకొని టిప్పర్‌ను సీజ్ చేశామని ఎస్సై అజయ్ తెలిపారు. ఆరెపల్లి గ్రామ గోదావరి తీరం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా తహసీల్దార్ వాహనాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ విష్ణు, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ధర్మపురి : తాళంవేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దోనూర్ గ్రామానికి చెందిన కొత్తపెల్లి ఉమాదేవి ఈనెల 1న బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసివెళ్లారు. మరుసటి రోజు సాయంత్రం ఇంటికి రాగా ఇంట్లోని 7 తులాల బంగారు ఆభరణాలు, 14 తులాల వెండి, రూ.5వేల నగదు, రెండు హోంథియేటర్ బాక్సులను అపహరణకు గురైనట్లు గుర్తించింది. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో ఏఎస్సై రాజు చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్సీ మండిపాటు

- ప్రజా సమస్యలను కలెక్టర్‌కు చెప్పుకోనివ్వరా..
- అడ్లూరి అరెస్టును ఖండించిన జీవన్‌రెడ్డి

సారంగాపూర్ : ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజా సమస్యలను కలెక్టర్‌కు వివరించే స్వేచ్ఛ లేదా అని అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను అరెస్టును ఖండించారు. ఇథనాల్ పరిశ్రమకు పర్యావరణ అనుమతులున్నాయా, దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందా అని ప్రశ్నించారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని వెల్గటూర్ మండలం పాశిగాం గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు దరఖాస్తు ఇచ్చేందుకు వెళ్తుండగా పాశిగాం గ్రామ ప్రజలకు సంఘీభావంగా లక్ష్మణ్‌కుమార్ రావడం తప్పేంటి అన్నారు. లక్ష్మణ్‌కుమార్ అక్రమ అరెస్టు సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల వెన్నంటే ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తుందని ఎమ్మెల్సీ తెలిపారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపిన దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ విప్లవంలో చెరగని ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపురం రాంచందర్, రాపర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణం ఆపండి

జగిత్యాలరూరల్: కండ్లపల్లి, హన్మాజీపేట, పొరండ్ల, తిప్పన్నపేట శివారు నుంచి వ్యవసాయ పొలాల మీదుగా నిజామాబాద్ – మంచిర్యాల మధ్య చేపట్టే ఎన్‌హెచ్–63 జాతీయ రహదారి పనులను నిలిపివేయాలని రైతులు కోరారు. సోమవారం కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఫిర్యాదు చేశారు. తమ గ్రామాల్లోని రైతులు ఎకరం, రెండెకరాల్లోపు వ్యవసాయ భూములు ఉన్న చిన్న, సన్నకారులేనన్నారు. కొత్తగా నిర్మించే జాతీయ రహదారితో భూములు కోల్పోయి ఇబ్బందులు పడుతామని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పనులను నిలిపివేసి, పాత రోడ్డుకు ఇరువైపులా పనులను చేపట్టాలని వారు కోరారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

జగిత్యాల: పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలో సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. మొత్తం 11,183మంది విద్యార్థులకు 69 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు 11,167 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 97.13 శాతం హాజరు శాతం నమోదైంది. 89 మంది సప్లిమెంటరీ విద్యార్థులకు 82 మంది పరీక్షకు హాజరయ్యారు. తొలిరోజు ఫ్లయింగ్ స్క్వాడ్స్ 18 కేంద్రాల్లో తనిఖీలు చేసింది. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.